క్లుప్తంగా

భవిత కేంద్రంలో తనిఖీలు



ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ సూర్యారావు

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, గత ఏడాదికి, ప్రస్తుతం కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల సంఖ్య పెరిగింది లేనిదీ తెలుసుకున్నారు. పిల్లల అభ్యసనస్థాయిని పరీక్షించడంతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఐఈ కో–ఆర్డినేటర్ ఎం.భారతి, ఫిజియోథెరపిస్ట్ మనోజ్ కుమార్, ఐఈఆర్టీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ ఉన్నారు.

పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు, అధ్యాపకులు

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య, నోట్ పుస్తకాలను ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సి పాల్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. అధ్యాపకుల కృషి ఫలితంగా గతేడాది ఇంటర్‌లో తమ కళాశాల విద్యార్థులు 98శాతం ఉత్తీర్ణత సాధించడంతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచామన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. ఈఏడాది కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఈనెల 31వరకు అడ్మిషన్లకు గడువు ఉందని, ఆసక్తి ఉన్న పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో చేరాలని కోరారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


గుర్ల తహసీల్దార్‌గా ఆదిలక్ష్మి



పి.ఆదిలక్ష్మి

గుర్ల: మండల తహసీల్దార్‌గా పి.ఆదిలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సేవలందిస్తానని చెప్పారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక



గంట్యాడ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నారాయణరావు, కార్యదర్శి రవి, ట్రెజరర్ సన్యాసిదేవుడు

గంట్యాడ: కొత్తవలసలో ఆదివారం విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గాల ఎన్నికను రాష్ట్ర సంఘం పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. అందులో భాగంగానే మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా గోను గుంట్ల నారాయణరావు, కార్యదర్శిగా వల్లంపాటి రవి, ట్రెజరర్‌గా కందుకూరి సన్యాసిదేవుడు, ఇతర కార్య వర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.

గ్రీన్ చాలెంజ్



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేలా స్థానిక మొహంతి కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సోమవారం పట్టణంలో ర్యాలీ చేశారు. ర్యాలీని ప్రిన్సిపాల్ శాంతి మొహంతి ప్రారంభించారు. జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, అటవీశాఖ అధికారి డి.సత్యం అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు మొక్కలు చేతపట్టి ప్రతీ ఇంటికి చెట్టు, ప్రగతికి మెట్టు అంటూ నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులకు మొక్కలు అందజేశారు.

వ్యవసాయరంగానికి పాతర

- కేంద్రబడ్జెట్‌పై వ్యవసాయ కార్మిక సంఘం నిరసన
- బడ్జెట్ ప్రతుల దహనం

శృంగవరపుకోట/గంట్యాడ: వ్యవసాయరంగాన్ని కుదేలు చేసి, పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేలా కేంద్రబడ్జెట్ ఉందని సీపీఎం అనుబంధ ఏపీ రైతు జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అప్పారావు, కార్యదర్శి బుద్దరాజు రాంబాబు, సహాయ కార్యదర్శి మద్దిల రమ ణ తదితరులు ధ్వజమెత్తారు. వ్యవసాయ కార్మికసంఘం నేతల నేతృత్వంలో ఎస్.కోటలోని దేవీ కూడలిలో, గంట్యాడ మండలంలోని బుడతానపల్లి గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం వారు కేంద్రబడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ వ్యవసాయ అనుబంధరంగాలకు బడ్జెట్‌లో 21.2 శాతం కోత విధించారన్నారు. కనీస మద్దతు ధర కల్పించి పంట కొనుగోలుకు ఎలాంటి చర్యలు లేవని మండిపడ్డారు. ఉపాధి హామీ, పీఎం ఫసల్ భీమాయోజన, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన వంటి పథకాలకు మధ్యంతర బడ్జెట్‌లో కేటాయించిన దానికన్నా తక్కువ కేటాయింపులు చేశారన్నారు. ప్రభుత్వరంగ వ్యవసాయ పరిశోధన కేంద్రాలను బేయర్, అమెజాన్ వంటి బహుళ జాతి కంపెనీలకు అప్పగించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లు, వారి ఏజెంట్లకు భూమోసాలు సులభంగా చేసుకునేలా కేంద్రీకృత డిజిటల్ సిస్టమ్ ప్రతిపాదన తెరపైకి తెచ్చారని ఆరోపించా రు. తక్షణం సవరించిన బడ్జెట్‌లో దేశ జనాభాలో 60 శాతంగా ఉన్న రైతులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులు అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: బుడతానపల్లి గ్రామంలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న వ్యవసాయ సంఘాల నేతలు

ప్రబలుతున్న వైరల్ జ్వరాలు

- నిరుపయోగంగా మలేరియా సబ్ యూనిట్
- దోమల నివారణకు కానరాని చర్యలు
- గంబూషియా చేపల సరఫరా నిల్

చీపురుపల్లి: మండలంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. అటు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైరల్ జ్వరాలతో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతూ వస్తోంది. చీపురుపల్లి ప్రభుత్వ సామాజిక ఆరో గ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో గల ల్యాబ్‌లో సోమవారం జ్వరంతో బాధపడుతూ వచ్చిన 30 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి టైఫాయిడ్ పాజిటివ్ వచ్చినట్లు సిబ్బంది నిర్ధారించారు. సీహెచ్‌సీలో ఒకరోజు నిర్వహించిన పరీక్షల్లోనే ఇంత మందికి టైఫాయిడ్ జ్వరాలని నిర్ధారణ అయితే...ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇంకెంత టైఫాయిడ్, మలేరియా కేసులు నమోదవుతున్నాయో మరి. అధిక ఉష్ణోగ్రత, చలి జ్వరం, ఒల్లు నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. వీరికి వైద్యులు వైరల్ జ్వరం అంటూ ఐదు రోజులకు సరిపడా మందులు రాసి ఇస్తున్నారు. వైరల్ జ్వరాల వ్యాప్తి నివారణకు సంబంధిత శాఖల అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి కేంద్రంగా మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం ఇక్కడే ఉన్నప్పటికీ వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేప ట్టాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో యంత్రాంగం విఫలమయ్యిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, పట్టణాల్లో సైతం ఎక్కడికక్కడే నీరు నిలిచిపోవడం, కాలువలు వీధుల్లో పారడం జరుగుతోంది. దీంతో దోమలు సంఖ్య పెరిగిపోయింది. దోమల నివారణ కోసం మలేరియా సబ్ యూనిట్ అధికారులు గంబూషియా చేపలు చెరువుల్లో విడిచిపెట్టడం, కాలవులు శుభ్రం చేయించడం, వీధుల్లో మలాథియన్ స్ప్రే చేయించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలోనే అలాంటి చర్యలు ఇంతవరకు కానరాలేదంటే ఇక గ్రామాల్లో సంగతి చెప్పాల్సిన పని లేదు. అసలు మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం ఎక్కడుందో, అందులో అధికారు లు ఎవరో కూడా స్థానికులకు తెలియని దుస్థితి నెలకొంది. పెరుగుతున్న జ్వరాలను అదుపు చేసేందుకు అధికారులను అప్రమ త్తం చేసేందుకు పాలకవర్గం నేతలు సైతం దృష్టి సారించడం లేదు. దీంతో అధికారులు కూడా కనీసం పట్టించుకునే పాపాన పోవడం లేదు. ఇదే విషయమై మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు సాక్షి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన మొబైల్ స్విచ్ ఆఫ్ అని సమాధానం ఇచ్చింది.

సహారా బాధితుల ధర్నా



ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, సహారా బాధితులు

శృంగవరపుకోట: తమ డిపాజిట్‌లను తక్షణం వెనక్కి చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ సహారా ఇండియా కంపెనీ డిపాజిట్‌దారులు స్థానిక దేవీ జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. సహారా ఏజెంట్లు, బాధితులు, ఏసీఐటీయూ నాయకులు స్థానిక ఆర్టీసీ కాంప్లె క్స్ నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రభుత్వానికి, సహారా యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దేవీ జంక్షన్‌కు చేరుకుని అక్కడ ధర్నా చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అప్పారావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్.ముత్యాలు, నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ మాట్లాడుతూ చిరువ్యాపారాలు, కూలీ చేసుకుని కుటుంబ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును సహారా సంస్థ దోచుకుంటే బాధ్యత తీసుకోవాల్సిన ప్రభుత్వాలు చేష్టలుడిగి చూస్తున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిపాజిట్లకు కాలపరిమితి ఎప్పుడో చెల్లిపోయినా నేటికీ చెల్లింపులు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సహారా యాజమాన్యం ఏవో మిషలు చూపుతూ చెల్లింపులు చేయకుండా తాత్సారం చేస్తూ, సీఆర్‌సీని, సుప్రీంకోర్టులను పక్కదారి పట్టిస్తోందన్నారు. ఇప్పటికే చాలా మంది ఖాతాదారులు మరణించారని, సహారాను నమ్మిన వారి కుటుం బాలు రోడ్డున పడ్డాయని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. సహారా బాధితుల సంఘం ప్రతినిధి షేక్ అమానుల్లాఖాన్, నాయకులు అప్పలరాము, తాతారావు, అబ్రహం, ఎస్.కోట, వేపాడ, జామి, లక్కవరపుకోట, కొత్తవలస, గంట్యాడ మండలాలకు చెందిన పలువురు సహారా ఏజెంట్లు, బాధితులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



ఆర్టీసీ డిపోలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ కార్మికులు

శృంగవరపుకోట: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రభుత్వం చొరవ చూపాలని ఎన్ఎంయూ నాయకులు కోరారు. సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎస్.కోట ఆర్టీసీ డిపోలో గేటు ధర్నా నిర్వ హించారు., ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని, సిక్ పీరియడ్‌కు వేతనాలు ఇవ్వాలని, అక్రమ చార్జ్‌షీట్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిపోలో ఏడీసీ పోస్టులు భర్తీ చేయాలని, అక్రమ ఓడీలు రద్దు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా మూడు రోజులు సెలవు ప్రక టించా లని, రెస్ట్‌రూమ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు జి.వి.రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.బి.నాయుడు, డిపో సెక్రటరీ ఏ.రాజయ్య, ట్రెజరర్ వి.వి.రమణ, జోనల్ వర్క్‌షాపు ప్రెసిడెంట్ జి.ఎస్.రాజు తదితరులు డీఎంకు మెమోరాండం సమర్పించారు.

చర్చలకు రాలేదు

కార్మికుల ధర్నా అనంతరం డిపో మేనేజర్ కె.రమేష్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారంపై సామరస్యంగా చర్చించుకుందామని కార్మిక సంఘం నేతలను ఈనెల 24న చర్చలకు పిలిచామని పేర్కొన్నారు. అయితే వారు 26న చర్చలకు వస్తామని చెప్పి, తర్వాత 27న జిల్లా అసోసియేషన్ సమావేశం తర్వాత వస్తామన్నారని, మళ్లీ పిలిస్తే చర్చలకు రాకుండా ధర్నాకు సిద్ధమయ్యారని తెలిపారు.

ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న అప్పారావు

దత్తిరాజేరు: వలసల నివారణ కోసం ఉపాధి హామీ పథకం పనిదినాలను 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పురం అప్పారావు ఎంపీడీఓను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు రెండు నెలలుగా ఉపాధి వేత నాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనాలు అందేలా చూడాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి లక్ష్యాలను చేరుకోవాలి

మెరకముడిదాం: మండలంలో స్త్రీనిధి రుణ లక్ష్యాలను చేరుకోవాలని వీఓఏలకు వెలుగు ఏపీఎం ఉమా మహేశ్వరరావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వీఓఏలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధికి సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1,000 మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.5 కోట్లు రుణం ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు కోటి రూపాయల వరకూ ఇచ్చామన్నారు. అలాగే బ్యాంకు లింకేజ్ రుణం రూ.45 కోట్లు అందజేయాల్సి ఉందన్నారు. లక్ష్యాలను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు మహిళా ప్రగతి కేంద్రంలో వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారని, యువత సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో ఎస్.కె.ఎస్.ఆర్.పురం, బంగారయ్యపేట గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల లను ఎంఈఓ జగదీశ్వరరావు సోమవారం సందర్శించారు. బంగారయ్యపేటలో శిథిల భవ నాలను పరిశీలించి, మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఎస్.కె.ఎస్.ఆర్.పురంలో పాఠశాల విద్యార్థుల హాజరు, రికార్డులు, లెసన్ ప్లాన్, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. ఎంఈఓ వెంట సీఆర్పీ కోటేశ్వరరావు ఉన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



శృంగవరపుకోట: ధర్మవరంలో విద్యార్థులకు వడ్డన చేస్తున్న ఉపాధ్యాయులు



శృంగవరపుకోట: తిమిడిలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



వేపాడ: సోంపురంలో భోజనాలు వడ్డిస్తున్న ఉపాధ్యాయుడు రవిశంకర్

- ‘శుభ్ దిన్ భోజన్’ పేరిట పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు

జాతీయ నూతన విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ పేరిట వారోత్సవాలు నిర్వహించారు. పాఠశాలల్లో రోజుకో కార్యక్రమం నిర్వ హించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం దాతల సహకారంతో ‘శుభ్ దిన్ భోజన్’ పేరిట ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, పాఠశాలల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు, సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భోజనాలు చేశారు. వేపాడ మండలం సోంపురం పాఠశాలలో సర్పంచ్ గంగరాజు భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. శృంగవరపుకోట మండలం ధర్మవరం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు ఎం.రహీం షేక్‌లాల్ తన తల్లి సురానీ బేగం పుట్టిన రోజు సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు.

– వేపాడ/దత్తిరాజేరు/గజపతినగరం రూరల్/శృంగవరపుకోట



వేపాడ: దబ్బిరాజుపేటలో భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు



దత్తిరాజేరు: పెదమానాపురం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గ్రామ పెద్దలు



గజపతినగరం రూరల్: జిన్నాం పాఠశాలలో భోజనాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఆశ పడ్డాం.. మోసపోయాం



- కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ సీట్లంటూ నమ్మించాడు
- రూ.2.095 కోట్లు తీసుకుని మోసం చేశాడు
- ఎస్పీ వద్ద మొరపెట్టుకున్న బాధితులు

శ్రీకాకుళం క్రైమ్ : ‘పిల్లల భవిష్యత్ బాగు పడుతుందని ఆశపడ్డాం.. విదేశాల్లో ఎంబీబీఎస్ సీట్లంటే మురిసిపోయాం. ఆరేళ్ల ఫీజు ఒకేసారి కట్టాలంటే డబ్బులన్నీ ఇచ్చేసి మోసపోయాం’ అంటూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థుల తండ్రులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వద్ద సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థుల తండ్రులు ఐదుగురు, విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థుల తండ్రులు ఎస్పీకి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తామంతా కలిసి తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్‌కు రూ. 2.095 కోట్లను బ్యాంకు ఖాతాల ద్వారా, నగదు రూపేణా వేసి మోసపోయినట్లు చెప్పారు. వారు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు..



కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీప యాతపేటలో జీబీఎస్ ఇంటర్నేషనల్ లార్జెస్ట్ అండ్ లీడింగ్ కన్సల్టెన్సీని 2022లో ప్రారంభించాడు. కజకిస్తాన్‌లోని ఓ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని దానికి రూ. లక్షల్లో సొమ్ము కట్టాల్సి ఉంటుందని ఒక్కో విద్యార్థి వద్ద ఒక్కోలాగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. సీటు, వసతికి సంబంధించి ఆరేళ్ల ఫీజు ఒకేసారి కట్టాలని హరీష్ గంగాధర్ విద్యార్థులకు చెప్పడంతో ఈ విషయాన్ని తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లాకు చెందిన పొందర సాంబమూర్తి (పోలాకి మండలం గాతలవలస) రూ. 32.50 లక్షలు, బోర అప్పోజి (పోలాకి మండలం చల్లయ్యవలస) రూ. 28.50 లక్షలు, దుప్పల దుర్గారావు (కుశాలపురం) తమ ఇద్దరు కుమారులకు రూ. 45 లక్షలు, పైడి అప్పలసూర్యనారాయణ (కుశాలపురం) రూ. 25 లక్షలు, అన్నెపు నానాజీరావు (శ్రీకాకుళం), రూ. 25 లక్షలు కట్టగా, విజయనగరం జిల్లాకు చెందిన ఓన రమణ (రాజాం, కొత్తవలస) 28.50లక్షలు, కొర్నాన అప్పలనాయుడు (బొండపల్లి మండలం రోళ్లవాక) రూ. 25 లక్షలు ముట్టజెప్పారు.

ఒక్క ఏడాదికే..

ఏడాది కిందట ఎనిమిది మంది విద్యార్థులను కజికిస్తాన్‌లో మెడికల్ యూనివర్సిటీ వారు ఫీజులు చెల్లించలేదంటూ హాస్టల్, కళాశాలల నుంచి పంపించేశారు. దీంతో హరీష్ అసలు బాగోతం బయటపడింది. తాము ఆరేళ్లకు చెందిన ఫీజును చెల్లించినా.. హరీష్ మాత్రం ఒక్క ఏడాదికే కళాశాల, వసతి, మెస్ ఫీజులు చెల్లించినట్లు విద్యార్థులు తెలుసుకుని తాము మోసపోయామని గ్రహించారు. దీంతో వెంటనే అతడిని నిలదీయగా.. బెదిరించడంతో పాటు దాడులకు కూడా పాల్పడ్డాడు. దీంతో వారంతా ఇంటి వద్ద విషయం చెప్పి స్వదేశానికి వచ్చేశారు. ఈ విషయమై ఇండియన్ ఎంబసీలో ఈ ఏడాది మార్చిలో విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

మోసానికి గురయ్యాం..



మాది వ్యవసాయ కుటుంబం. కొడుకును డాక్టర్‌గా చూడాలన్నది నా కోరిక. కొంతమంది ద్వారా పరిచయమైన హరీష్ గంగాధర్ ఇండియాలో మెడిసిన్ సీటుకు ఎక్కువవుతుందని, కజకిస్తాన్‌లో తక్కువతో పనవుతుందని చెప్పి రూ.లక్షల్లో డబ్బు కట్టించుకుని మోసం చేశాడు. ఎస్పీగారైనా న్యాయం చేస్తారని వచ్చాం. – **కొర్నాన అప్పలనాయుడు, రోళ్లవాక, బొండపల్లి మండలం, విజయనగరం**

అప్పే మిగిలింది..



నా ఇద్దరు కుమారుల భవిష్యత్ బాగుంటుందని ఆశపడి హరీష్‌కు రూ. 45 లక్షలు కట్టేశాను. ఏడాది ఫీజు మాత్రమే కట్టి మిగతా ఏడాదికి కట్టకపోవడంతో నిలదీస్తే.. కజకిస్తాన్‌లో పిల్లలపై దాడికి పాల్పడ్డాడు. దాడిపై అక్కడి పోలీసులకు, ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశాం. మా పిల్లలతో పాటు మిగతావారిపట్లా ఇదే తీరున వ్యవహరించాడు. పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయాం. **– దుప్పల దుర్గారావు, కుశాలపురం**

ఎన్నిచార్లు విచారణ చేపడతారు..?



ఎంపీడీఓ పావనితో మాట్లాడుతున్న పింఛన్‌దారులు

మెరకముడిదాం: సామాజిక పింఛన్ల లబ్ధిదారుల విషయంలో ఎన్నిసార్లు విచారణ చేపడతారని మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన పలువురు పింఛన్ లబ్ధిదారులు ఎంపీడీఓ పావనిని నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను సోమవారం వారు కలి సి తమ సమస్యను వివరించారు. తాము పింఛన్‌కు అనర్హులమని టీడీపీకి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణకు సిద్ధమవుతుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాము అనర్హులమైతే అధికారులు ఎలా పింఛన్ మంజూరు చేశారని, గతంలో ఇదే విధంగా తమపై ఫిర్యాదు చేసినప్పుడు అప్పటి ఎంపీడీఓ ఇందిరా రమణి గ్రామానికి వచ్చి విచారణ చేశారని, తామంతా అర్హులమేనని గుర్తిం చి, అధికారులకు నివేదించారని గుర్తు చేశారు. ఎంపీడీఓ పావని స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను నడుచుకుంటానని వారికి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణు గోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, పప్పల కృష్ణమూర్తి, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, లెంక భాస్కరరావు, గంట్యాడ రామారావు పాల్గొన్నారు.